క్లుప్తంగా

మొండికుంటకు త్రీ ఫేజ్ విద్యుత్

అశ్వాపురం: నూతన పరిశ్రమల నిర్వహణకు అనువైన త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం మండల పరిధిలోని మొండికుంటలో అందుబాటులోకి రానుంది. ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రత్యేక నిధులతో ఈ సౌకర్యం కల్పించనున్నట్లు మొండికుంట సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ మేడవరపు సుధీర్.. సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. గ్రామ పంచాయతీ సర్పంచ్, పాలవకర్గం విన్నపం మేరకు రూ.2,73,076లు ఖర్చయ్యే త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యానికి ఎమ్మెల్యే రేగా నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. త్రీఫేజ్ విద్యుత్ అందుబాటులో ఉంటే నూతనంగా పరిశ్రమలు, రైస్ మిల్లులు, గోడౌన్‌లు, అట్టల ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసుకోవచ్చని వారు తెలిపారు.

కేసు వెనక్కి తీసుకోవాలి

భద్రాచలంటౌన్: ముఖ్యమంత్రి కేసీఆర్‌పై పెట్టిన కేసును భద్రాచలం ఎమ్మెల్యే వెంటనే వెనక్కి తీసుకోవాలని టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరికెళ్ల తిరుపతిరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యే తీరును వారు తీవ్రంగా ఖండించారు. భద్రాద్రి అభివృద్ధికి టీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో మానే రామకృష్ణ, కృష్ణమూర్తి, చిట్టిబాబు, రామకృష్ణ, లోకేష్ పాల్గొన్నారు.

బురదనీరు తొలగించిన యువకులు

అశ్వాపురం: మండల కేంద్రంలో అశ్వాపురం -గొందిగూడెం రహదారిపై నీరు నిలిచి బురదమయం అవడంతో స్థానికులు నాటు వేసి నిరసన తెలిపిన తెలిసిందే. సోమవారం గ్రామానికి చెందిన యువకులు చుంచు రామ్మూర్తి, ప్రవీణ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ రోడ్డుకు ఇరువైపులా కాలువలు తీసి రహదారిపై నీరు బయటకు పోయేలా చేశారు. అశ్వాపురం-గొందిగూడెం రహదారి రోడ్డు పనులు నాలుగు, ఐదు రోజుల్లో ప్రారంభమై త్వరలోనే పూర్తి అవుతాయని, కాంట్రాక్టర్ వల్ల ఆలస్యమైందని రామకృష్ణ తెలిపారు.

అలుగుపై పట్టింపు లేదు..

కరకగూడెం: మండలంలోని చిరుమళ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని కొలూరు గ్రామంలో ఉన్న రేగులకుంట చెరువు అలుగు కోతకు గురై నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా నేటి వరకు పునరుద్ధరించలేదని టీడీపీ పినపాక నియోజకవర్గ నాయకులు చందా మధు ఆరోపించారు. సోమవారం ఆయన సదరు ప్రాంతాన్ని రైతులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటువంటి సమస్యలను గుర్తించి అలుగులు తూముల నిర్మాణం చేపడితే రైతులకు ఉపయోగముంటుందని అన్నారు.

పుస్తకావిష్కరణ

అశ్వారావుపేటరూరల్: ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు రచించిన 'కమలం వలె వికసించు' పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. అశ్వారావుపేటకు చెందిన రచయిత భార్య సిద్ధింతపు నాగమణి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ పుస్తకాన్ని విడుదల చేశారు. పుస్తకాన్ని పూజితాశ్రీ సాత్విక్ ప్రచురణల ద్వారా విడుదల చేసినట్లు ప్రభాకరాచార్యులు తెలిపారు.

బానిసలు కావొద్దు

చర్ల: ఏ పార్టీలో ఉన్నా గిరిజనేతరులంతా ఒక్కటిగానే ఉండి గిరిజనులను మోసం చేస్తారని, ఈ విషయాన్ని గుర్తించి గురిజనులెవ్వరూ గిరిజనేతరుల చేతిలో బానిసలుగా మారవద్దని ఆదివాసీ సేనా జిల్లా కోకన్వీనర్ న్యాయవాది కారం రమేష్ అన్నారు. సోమవారం దుమ్ముగూడెం మండలంలోని రామారావుపేటలో జరిగిన ఆదివాసీ సేన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కడ సహజ వనరులుంటే అక్కడికి గిరిజనేతరులు ఒక్కడిగా వచ్చి గిరిజనుల మధ్యనే చిచ్చుపెట్టి గిరిజనులను చిన్నాభిన్నం చేస్తారని ఆరోపించారు.

రెయిన్ కోట్లు పంపిణీ

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓసీ-2 గని వాషింగ్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధిత కాంట్రాక్టర్ బి.కృష్ణ ఆధ్వర్యంలో సెక్షన్ ఇన్‌చార్జ్ ఎస్ఈ రాజారావు చేతుల మీదుగా సోమవారం రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. సెక్షన్ ఫోర్‌మెన్‌లు పి.నారాయణ, ఇమ్మానియేల్, టీబీజీకేఎస్ నాయకులు గోపి, ఇఫ్టూ నాయకులు నాసర్‌పాషా, కాంట్రాక్ట్ కార్మికులు సామేలు, కస్నా, నాగేశ్వరరావు, రాజా, చారి, ప్రసాద్, మహర్షి, తిరుపతి, దేవేందర్ పాల్గొన్నారు.

నగదు వితరణ

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన పిట్టల యాదగిరి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ పినపాక నియోజకవర్గ కోఆర్డినేటర్ కాటిబోయిన నాగేశ్వరరావు బియ్యం, కొంత నగదును వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం సుధాకర్‌రెడ్డి, నాయకులు కొత్తపల్లి సత్యనారాయణ, కలబోయిన మాధవరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మో.. కుక్కలు!

- స్వైరవిహారం చేస్తున్న శునకాలు
- వందల సంఖ్యలో కుక్కకాటు బాధితులు
- భయాందోళనలో ప్రజానీకం
- దృష్టి సారించని అధికారులు


జూన్‌లో కుక్కకాటు బారిన పడిన బాధితులు


అశ్వారావుపేటలో గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

అశ్వారావుపేటరూరల్: పాదాచారులు, ఇళ్ల ముందు నిలబడి ఉన్న వాళ్లు, వాకింగ్‌కు వెళ్లే వారిపై పిచ్చి కుక్కలు వెంటాడి దాడికి పాల్పడుతున్నాయి. దీంతో కుక్కలను చూస్తేనే ప్రజలు హడలిపోతున్నారు. పిల్లలూ, పెద్దలు తేడా లేకుండా భయందోళన గురికావాల్సివస్తోంది.

అశ్వారావుపేట మేజర్ పంచాయతీ పరిధిలోని మద్దిరావమ్మ గుడి సెంటర్, పేటమాలపల్లి, దొంతికుంట, గాంధీబొమ్మ సెంటర్, పోస్టు ఆఫీస్ రోడ్, ముస్లిం బజారు, వడ్డెర, గౌడ బజార్లు, దండాబత్తుల బజారు, గెస్ట్ హౌజ్ ఏరియాతోపాటు, మండలంలోని పేరాయిగూడెం, వినాయకపురం, వినాయకపురం కాలనీ, గాండ్లగూడెం, అనంతారం, గుమ్మడవల్లి, బచ్చువారిగూడెం, నారాయణపురం, ఆసుపాక, తిరుమలకుంట గ్రామాల్లో కుక్కలు స్వైర వీహారం చేస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో పిచ్చి కుక్కలు అధికంగా సంఖ్యలో కనిపిస్తున్నాయి. గడిచిన కొద్ది రోజులుగా పాదాచారులు, వాహనదారులను వెంటాడి మరి దాడి చేస్తున్నాయి. దాడిలో బాధితులు తీవ్రంగా గాయపడుతున్నారు.

బాధితుల సంఖ్య అధికం..

కుక్కకాటు బాధితుల సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతోంది. గడిచిన నెల రోజుల్లోనే 20కి మందికి పైగా పిచ్చి కుక్క కాటు బారిన పడ్డారు. వీరిలో అత్యధికంగా అశ్వారావుపేటలోని మేజర్ పంచాయతీ వాసులే కాగా, మిగిలిన వారు వినాయకపురం, గాండ్లగూడెం వాసులు ఉన్నారు. గడిచిన రెండేళ్లుగా కేవలం ప్రభుత్వ ఆస్పత్రుల లెక్కల ప్రకారం చూస్తే.. కుక్క కాటు బాధితులు వందల సంఖ్యలో ఉన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదు కాకుండా, ప్రైవేటుగా వైద్యం పొందిన వారు అధికంగా ఉంటారు. ఈ రెండేళ్లలో ప్రైవేటుగా వైద్యం పొందిన వారి సంఖ్యనే సుమారు 300 మందికిపైగానే ఉంటారని అంచనా. కాగా.. అశ్వారావుపేటలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిల్లో గడిచిన ఏడాది (2022-23) ఏప్రిల్ వరకు 470 మంది, ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు 182 మంది, అదే విధంగా మండలంలోని గుమ్మడవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గడిచిన ఏడాది ఏప్రిల్ వరకు 145 మంది, ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ నాటికి 148 మంది, వినాయకపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గడిచిన ఏడాది ఏప్రిల్ దాకా 196, ఈ ఏడాది జూన్ వరకు 63 మంది కుక్క కాటు బారిన పడ్డారు. ఈ మూడు ప్రభుత్వ ఆస్పత్రుల పరిధిలోనే గడిచిన రెండేళ్లలో 1204 మంది కుక్క కాటు బారిన పడి వ్యాక్సిన్లు వేయించుకున్నారు.

వ్యాక్సిన్లు లేకుంటే తంటాలే..

పిచ్చి కుక్కలు అధికంగా ఉండటంతో వాటి బారిన పడిన బాధితులు అశ్వారావుపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి, వినాయకపురం, గుమ్మడవల్లి పీహెచ్‌సీలకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. ఒకొక్కసారి కుక్క కాటుకు సంబంధించిన వ్యాక్సిన్లు స్థానికంగా నిల్వ లేకపోతే బాధితులు దాదాపు 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికు పరుగులు పెట్టాల్సి వస్తోంది.

పంచాయతీ పట్టింపేది?

కాగా, విచ్చలవిడిగా, గుంపులు గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కల నివారణపై గ్రామ పంచాయతీల నుంచి ఏలాంటి చర్యలూ తీసుకోకపోవడం పట్ల స్థానికులు తీవ్ర అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధితుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ స్పందన లేకపోవడంపై ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ బాధ్యులు, అధికారులను స్థానికులు వేడుకుంటున్నారు.

కుక్కలను చూస్తేనే భయమేస్తోంది..



వీధుల్లో పిచ్చి కుక్కలు అధికంగా సంచరిస్తున్నాయి. వాటిని చూస్తేనే భయపడాల్సి వస్తోంది. ఈ మధ్య ఒకే రోజు తొమ్మిది మందిని పిచ్చి కుక్క దాడి చేసి గాయపరిచింది. విచ్చలవిడిగా తిరుగుతూ దాడి చేస్తున్న కుక్కలను నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎస్‌కె.లాల్ అహ్మద్, అశ్వారావుపేట

వ్యాక్సిన్ వేయించుకోవాలి



గడిచిన ఆరు నెలలుగా కుక్క కాటు బాధితులు అధికంగానే ఆస్పత్రికి వస్తున్నారు. వీరికి సకాలంలో వ్యాక్సిన్లు వేసి, వైద్యం అందిస్తున్నాం. ఆస్పత్రిలో వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. కుక్క కాటు బారిన పడిన వారి తక్షణమే వ్యాక్సిన్ వేయించాలి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం ఉండే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ మధుశిక, గుమ్మడవల్లి వైద్యాధికారి

జోరు వానలోనూ విధి నిర్వహణ


ట్రాక్టర్‌లో చెత్త సేకరిస్తున్న కరకగూడెం పంచాయతీ సిబ్బంది

కరకగూడెం: మండల వ్యాప్తంగా సోమవారం తెల్లవారుజాము నుంచి జోరుగా వర్షం కురుస్తుండగా.. కరకగూడెం గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది ఉదయం ఎప్పటిలాగానే జోరు వానలో విధులు నిర్వర్తించారు. గ్రామంలో తిరుగుతూ చెత్తను సేకరించి ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. ఇన్‌చార్జ్ ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శి శ్యామ్‌సుందర్ రెడ్డి పంచాయతీలో పర్యటిస్తూ పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ఎండా వానల్లోనూ పంచాయతీ కార్మికులు ఈ రకంగా నిర్వహిస్తున్న విధులు.. సమ్మెలో నినదిస్తున్న తమ డిమాండ్లు న్యాయమైనవని నిర్ధారించడానికి గీటురాయి. అయితే, పలు కారణాల మూలంగా ఈ ప్రాంతంలోని పంచాయతీ కార్మికులు సమ్మెకు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది.

అభివృద్ధి పథంలో అశ్వాపురం

అశ్వాపురం: ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు కృషితో అశ్వాపురం మండలం అభివృద్ధి పథంలో సాగుతోందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ అన్నారు. స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం జెడ్పీటీసీ, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అశ్వాపురం నుంచి వయా గొందిగూడెం, రామవరం, భీమవరం, తుమ్మలచెరువు మీదుగా మొండికుంట ఆర్అండ్‌బీ రోడ్డు వరకు సుమారు రూ.5 కోట్లతో బీటీ రోడ్డు మంజూరు అయిందని, ఐదు రోజుల్లో పనులు ప్రారంభమవుతాయని అన్నారు. గొందిగూడెంలో రూ.7 కోట్లతో ఇసుకవాగుపై వంతెన పనులు జరుగుతున్నాయని, రూ.5 కోట్లతో లోతువాగుపై వంతెన మంజూరు అయిందన్నారు. మండల కేంద్రంలో డ్రెయినేజీ, సెంట్రల్ లైటింగ్ పనులు, మొండికుంటలో డ్రెయినేజీ పనులు జరుగుతున్నాయన్నారు. అశ్వాపురం రైల్వేస్టేషన్, ఎలకలగూడెం రోడ్డు, సర్వాయిపాడుబంజర రోడ్డు, రామచంద్రాపురం-ఇరవెండి రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, వైస్ ఎంపీపీ వీరభద్రం, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు గజ్జల లక్ష్మారెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్, నాయకులు సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, గద్దల రామకృష్ణ, లంకెల రమేష్, నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు సన్మానం


న్యాయవాదులను సన్మానించిన లయన్స్ క్లబ్ సభ్యులు

భద్రాచలంఅర్బన్: ప్రపంచ న్యాయ దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాద వృత్తిలో సేవలు అందించిన ఎంవీ ప్రసాద్‌రావు, టి.చైతన్య, పాయం రవివర్మ, పి.తిరుమలరావులను సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు భీమవరపు వెంకటరెడ్డి, ప్రోగ్రాం చైర్మన్ బిల్లిపెళ్లి రంగారెడ్డిలు మాట్లాడారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గుండు శరత్, ఫాస్ట్ ప్రెసిడెంట్ వై.సూర్యనారాయణ, కోశాధికారి జి.భరత్ కుమార్, పి.దేశప్ప, బీవీ రమణారెడ్డి, పి.సత్యనారాయణ, భోగాల శ్రీనివాస్ రెడ్డి, గోళ్ల భూపతిరావు, బోనాల సూర్యనారాయణ, గాదె మాధవరెడ్డి, అడబాల వెంకటేశ్వరావు, దాట్ల శ్రీనివాస్ రాజు, నరసింహ చారి, పద్మనాభ నివాసు, రామలింగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాలలో సీతారాముల కల్యాణం


కల్యాణం అనంతరం పర్ణశాల రామయ్య..

చర్ల: దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాలలో సీతారామచంద్రస్వామి దేవాలయంలో సోమవారం ఆషాడ శుద్ధ అమావాస్య పునర్వసు నక్షత్రం సందర్భంగా స్వామి వారికి కల్యాణం జరిపించారు. కల్యాణంలో భాగంగా స్వామి వారికి విశ్వక్షేణ పూజ, పుణ్యాహవచనంయాత్రధారణ, కంకణాధారణ, యజ్ఞోపవీతధారణ, మహాసంకల్పం, మంత్రపుష్ప వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్.కిరణ్‌కుమారాచార్యులు, ఎస్.నర్సింహాచార్యులు, ఆలయ సిబ్బంది ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

కరకగూడెం: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల నూతన కార్యాలయాన్ని బుధవారండీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

22న ఆయుర్వేద వైద్యశిబిరం

మణుగూరురూరల్: మణుగూరు ఏరియాలోని పీవీకాలనీ సీఈఆర్ క్లబ్ భద్రాద్రి స్టేడియంలో ఈ నెల 22వ తేదీన సింగరేణి ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి ఎస్.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 22న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఆయుర్వేద శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. సింగరేణీయులు, వారి కుటుంబ సభ్యులు వినియోగించుకోవాలని కోరారు.

రైతులకు అండగా సంస్థ

చర్ల: వ్యవసాయ యంత్ర పరికరాలు, ఉపకరణాలను సబ్సిడీపై అందజేస్తూ గ్రామీణ వ్యవసాయ అభివృద్ధి సంస్థ రైతులకు అండగా నిలుస్తోందని దేవరాపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ కారం సమ్మయ్య అన్నారు. 50 శాతం సబ్సిడీపై దేవరాపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న 6 గ్రామాల్లోని 100 మంది రైతులకు 100 డబుల్‌బ్యాటరీ పవర్ స్ప్రేయర్లను పంపిణీ చేశారు. సంస్థ చైర్మన్ విఘ్నేషన్, మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణరాజు, కిసాన్ పరివార్ ఫౌండేషన్, ఎస్‌పీడీసీఎల్ చైర్మన్ వెంకటేష్, సీఈఓ కావేరి, క్లస్టర్ మేనేజర్ నాగేంద్ర, నాగరాజు, అనీల్‌కుమార్, బాగ్యశ్రీ పాల్గొన్నారు.

పొంగులేటిని కలిసిన మాజీ ఎమ్మెల్యే

కరకగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర సోమవారం ఖమ్మం మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కోచైర్మన్‌గా ఇటీవల నియమితులవడంపై పొంగులేటికి శాలువ కప్పి అభినందనలు తెలిపారు. దీంతోపాటు తాజా రాజకీయాలపై చర్చించినట్లు చందా లింగయ్య దొర తెలిపారు. సీఎం కేసీఆర్‌ను గద్దె దించడమే తమ ముందున్న లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చందా సంతోష్ కుమార్, తాళ్లూరి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

వైద్యులను నియమించాలి

చర్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులను నియమించాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ మేరకు చర్లలోని అంబేడ్కర్ సెంటర్‌లోని ప్రధాన రహదారిపై బైఠాయించి నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కొండా చరణ్ మాట్లాడుతూ.. చర్ల ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రేగా అంద్రెయ్య, కనితి భానుప్రకాశ్, చల్లా బాలు, ఉబ్బిడి నాగేశ్వరావు, రాజేష్, చిమిడి సుజాత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

అన్నపురెడ్డిపల్లి: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో రుంజా బుచ్చమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం ప్రకటించిన మేరకు పెంచిన వేతనాలను విడుదల చేసి మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కీసరి అనసూయ, నీలం రాములమ్మ, సీత, శాంత, సీపీఎం మండల కార్యదర్శి వెంకటరత్నం పాల్గొన్నారు.

యాత్ర పోస్టర్లు ఆవిష్కరణ

భద్రాచలంటౌన్: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరింపచేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ ఏటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న సంకల్ప రథయాత్ర పోస్టర్‌ను పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పొదెం వీరయ్య సోమవారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2004 తరువాత నియమింపబడడిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టం చేకూర్చే విధంగా నూతన పెన్షన్ విధానం ఉందని, పాతన పెన్షన్ విధానానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బోదెబోయిన జయబాబు, తిరుపతిరావు, శ్రీనివాస్, జ్యోతి, పూర్ణచంద్రరావు, రవీందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను అమలు చేయాలి

బూర్గంపాడు: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని టీఎస్‌టీటీఎఫ్ మండల అధ్యక్షుడు అజ్మీరా బాలాజీ డిమాండ్ చేశారు. సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఈ నెల 16 నుంచి టీఎస్‌సీపీఎస్ఈ తలపెట్టిన సంకల్ప రథయాత్రకు టీఎస్‌టీటీఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. సీపీఎస్ రద్దు కోరుతూ ఈ నెల 19న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ఆందోళన కార్యక్రమానికి ఉద్యోగ, ఉపాధ్యాయలు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

సురక్షిత ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలివ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న నరేష్

చర్ల: గోదావరి ముంపు ప్రాంతాల వారికి సురక్షిత ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించి గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి కారం నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని బీఎస్ రామయ్య భవన్‌లో జరిగిన పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముంపు నుంచి నియోజకవర్గాన్ని రక్షించేందుకు సీఎం కేసీఆర్ మంజూరు చేస్తానన్న రూ.1000 కోట్లను వెంటనే విడుదల చేయాలని, గోదావరి వరదల నుంచి కాపాడేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సహాయ కన్వీనర్ దనసరి సంపత్, నాయకులు బందెల చంటి, మచ్చా రామారావు, తాళ్లూరి కృష్ణ, యాలం ప్రసాద్, పామారు బాలాజీ, అనీల్, పడిగల రమేష్, పరవా శేఖర్, జంపన్న, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులతో మాజీ ఎమ్మెల్యే సమావేశం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరురూరల్: మండల పరిధిలోని తోగ్గూడెంలో ఉన్న ఫంక్షన్ హాల్‌లో పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బొగ్గు ముఠా కార్మికులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొగ్గు ముఠా కార్మికులందరూ సమస్యల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలన్నారు. సమస్యల పరిష్కారంలో కార్మికులకు అండగా నిలిచి పోరాటం చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, కాంగ్రెస్ నాయకులు పీరినాకి నవీన్, వైస్ఎంపీపీ కేవీరావు, ఉపసర్పంచ్‌లు పుచ్చకాయల శంకర్, గోరంట్ల కనకయ్య, తరుణ్‌రెడ్డి, వెంకట్రావు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల నిరసన ర్యాలీ


భద్రాచలంఅర్బన్: సమ్మె శిబిరం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య



అశ్వారావుపేటరూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న జీపీ కార్మికులు

అశ్వారావుపేటరూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్‌లను పరిష్కరించాలని సోమవారం కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక రింగ్ రోడ్ సెంటర్ నుంచి సంత మార్కెట్ వరకు ర్యాలీ నిర్వహించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.కామేశ్వరరావు, వేల్పుల ముత్తారావు, మురళి, భవాని, ఆరేపల్లి నాగేంద్రరావు, కట్ట శ్రీనివాస్, నందు, రమణ పాల్గొన్నారు.

భిక్షాటనతో నిరసన..

దమ్మపేట: మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు సోమవారం భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మంగళవారం లోపు తమ సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో చెన్నారావు, బసవయ్య, ప్రభాకర్, అన్నవరం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మద్దతు..

భద్రాచలంఅర్బన్: పారిశుద్ధ్య కార్మికుల సమ్మెకు భద్రాచలం శాసనసభ్యుడు పొదెం వీరయ్య మద్దతు తెలిపారు. సోమవారం భద్రాచలంలోని సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. మద్దతు తెలిపిన వారిలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సరెళ్ళ నరేష్, టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్, జిల్లా ఎస్ఎస్ఎల్ అధ్యక్షుడు చింతరేల రవికుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాగా, శ్రీవెంకటేశ్వర కార్పెంటర్ యూనియన్ నాయకులు సైతం సమ్మెకు మద్దతు తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో సభను ఏర్పాటు చేసి గౌరవ అధ్యక్షుడు అనుగోజు నరసింహాచారి కార్మికుల డిమాండ్లపై మాట్లాడారు. సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబి.నర్సారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు సునీల్, రాయల రాములు, సీఐటీయూ నాయకులు నాగరాజు, కాపుల రవి, కార్పెంటర్స్ యూనియన్ నాయకులు మధుసూదనా చారి, సత్యబాబు, చాట్ల శ్రీనివాసరావు, సంతోష్ కుమార్, శ్రీను, సాయి, కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

చర్ల: జీపీ కార్మికుల సమ్మెకు బీఎస్పీ సంఘీబావం తెలిపింది. ఆ పార్టీ చర్ల మండల అధ్యక్షులు కూరపాటి వీర్రాజు సమ్మె శిబిరంలో కూర్చుని సంఘీభావం తెలిపారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ తడికల శివకుమార్, జిల్లా ఈసీ సభ్యుడు కనుకు సాగర్, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ పాడుతూరి రవీంద్రప్రసాద్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కొప్పుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కాలేజీల్లో పెరిగిన కటాఫ్

- కొత్తగా అందుబాటులో 14,565 కంప్యూటర్ కోర్సు సీట్లు
- కోరుకున్న కాలేజీలో సీఎస్ఈ సీటు దక్కించుకున్న విద్యార్థులు
- రెండో విడత కౌన్సెలింగ్‌లో జాగ్రత్తగా ఆప్షన్లు ఇస్తే కోరుకున్న సీటు!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లు పెరగడం ఈసారి విద్యార్థులకు కలిసి వచ్చింది. అన్ని కాలేజీల్లోనూ కటాఫ్ పెరిగింది. చాలామంది కోరుకున్న కాలేజీల్లో కంప్యూటర్ సైన్స్ సీటు దక్కించుకోగలిగారు. మొత్తం భర్తీ అయిన సీట్లలో 62.5% కంప్యూటర్ కోర్సులవే ఉన్నాయి. గత ఏడాది (2022) తొలి విడత కౌన్సెలింగ్‌లో జేఎన్‌టీయూహెచ్ (సీఎస్ఈ)లో బాలికలకు 422 ర్యాంకు వరకే సీటు వచ్చింది. ఈసారి బాలురకు 813వ ర్యాంకు వరకూ, బాలికలకైతే 962 ర్యాంకు వరకూ ఓపెన్ కేటగిరీలో సీటు వచ్చింది. పేరున్న ప్రైవేటు కాలేజీల్లో గత సంవత్సరం గరిష్టంగా 3 వేల లోపు ర్యాంకు వరకే సీటు వస్తే, ఈసారి ర్యాంకు 4 వేలు దాటినా సీట్లు వచ్చాయి. కొత్తగా కంప్యూటర్ కోర్సులు అందుబాటులోకి రావడంతో ఈ ఏడాది అదనంగా 7,635 సీట్లు మంజూరయ్యాయి. కొన్నేళ్లుగా డిమాండ్ లేని సివిల్, మెకానికల్, ఈఈఈ బ్రాంచీల్లో 6,930 సీట్లను కాలేజీలు రద్దు చేసుకున్నాయి. వీటి స్థానంలో విద్యార్థుల నుంచి డిమాండ్ ఉన్న కంప్యూటర్ కోర్సు సీట్లు పెంచుకున్నాయి. ఫలితంగా ఈ ఏడాది మొత్తం 14,565 కంప్యూటర్ కోర్సు సీట్లు కొత్తగా అందుబాటులోకి వచ్చినట్టయ్యింది. కాగా ఇందులో 10 వేలకు పైగా కన్వీనర్ కోటాలో ఉన్నాయి.

రెండో దశలోనూ మంచి చాన్స్!

తొలిదశ కౌన్సెలింగ్‌ను పరిశీలించిన విద్యార్థులు రెండో దశపై ఆశలు పెంచుకుంటున్నారు. ఈ దశలో కూడా కటాఫ్ మరింత పెరిగే వీలుందని భావిస్తున్నారు. ఈ ఏడాది 1,56,879 మంది ఎంసెట్ అర్హత సాధించారు. వీరిలో 76,821 మంది తొలి విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకున్నా 75,708 మంది మాత్రమే ఆప్షన్లు ఇచ్చారు. వీరిలో 70,665 మందికి సీట్ల కేటాయింపు జరిగింది. నిజానికి ఇందులో వెయ్యి లోపు ర్యాంకర్లు జేఈఈలోనూ ర్యాంకులు పొంది ఉండే వీలుంది. జోసా ఆరవ రౌండ్ కౌన్సెలింగ్ త్వరలో చేపట్టే వీలుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎంసెట్‌లో సీటు వచ్చిన వాళ్లు ఎన్ఐటీల్లో సీట్లు వస్తే వాటిల్లో చేరే వీలుంది. కొంతమంది ఇతర రాష్ట్రాల్లో ఇంజనీరింగ్ కాలేజీలకు వెళ్తారు. మరికొంత మంది డీమ్డ్ యూనివర్సిటీల్లో చేరతారు. మొత్తం మీద ఎంసెట్ తొలి రౌండ్‌లో సీట్లు వచ్చిన వారిలో 5 వేల మంది వరకూ రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో చేరే అవకాశం లేదని అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో రెండో రౌండ్‌లో జాగ్రత్తగా ఆప్షన్లు ఇస్తే కోరుకున్న బ్రాంచీలో, కాలేజీలో సీటు వచ్చే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

జాగ్రత్తగా పరిశీలించి ఆప్షన్ ఇవ్వాలి

రెండో దశ ఎంసెట్ కౌన్సెలింగ్‌లో జాగ్రత్తగా వ్యవహరించాలి. విద్యార్థి తనకు వచ్చిన ర్యాంకును దృష్టిలో పెట్టుకుని ఆప్షన్లలో ప్రాధాన్యత నిర్ణయించుకోవాలి. దీనికన్నా ముందు.. తాను కోరుకునే కాలేజీలో తొలిదశలో ఏయే ర్యాంకులకు సీట్లు వచ్చాయి? నిట్ వంటి జాతీయ కాలేజీలకు ఏయే ర్యాంకర్ల వరకూ వెళ్లే చాన్స్ ఉంది? అనే దానిపై కొంత కసరత్తు చేయాలి. గుడ్డిగా ఆప్షన్లు ఇవ్వకుండా, అన్నీ పరిశీలించి ఇస్తే కోరుకున్న బ్రాంచీ, కాలేజీ దక్కడం ఖాయం.

– ఎంఎస్ రావు (గణిత శాస్త్ర అధ్యాపకుడు)

తొలి దశ కౌన్సెలింగ్‌లో ప్రధాన కాలేజీల్లో ఈ ఏడాది కటాఫ్ ర్యాంకులు ఈ విధంగా ఉన్నాయి...

యాజమాన్యం		ఓపెన్	బీసీ-ఏ	బీసీ-బీ	బీసీ-సీ	బీసీ-డీ	బీసీ-ఈ	ఎస్సీ	ఎస్టీ
ఓయూ-సీఎస్ఈ	బాలురు	1391	3918	1804	5687	1912	2788	6101	7349
	బాలికలు	1598	5524	2284	-------	2215	1900	7136	8414
సీఎస్ఈ (ఏఐ)	బాలురు	2848	6195	3798	19380	4842	4790	10923	11076
	బాలికలు	2877	4328	3901	-------	4724	5987	13355	13947
ఈసీఈ	బాలురు	3623	8934	6822	-------	6248	-------	14626	15567
	బాలికలు	4436	10084	6855	-------	6337	5447	15561	18188
జేఎన్‌టీయూ	బాలురు	813	1579	1245	-------	1199	1886	4013	4534
సీఎస్ఈ	బాలికలు	962	2290	1028	-------	1579	-------	6753	6196
సీఎస్ఈ-ఏఐ	బాలురు	1359	3501	2131	-------	2399	4692	8932	8547
	బాలికలు	1915	3975	2232	-------	2885	4478	9572	10293
సీబీఐటీ	బాలురు	1478	4509	2246	6314	2296	3014	861	11217
	బాలికలు	1903	5314	2198	-------	2695	3867	11527	12687
వాసవీ సీఎస్ఈ	బాలురు	2405	7050	3008	12034	3837	6072	12291	15812
	బాలికలు	2266	6968	3907	-------	3648	6916	14525	16040
వీఎన్ఆర్ విజ్ఞాన	బాలురు	1712	4952	2636	3099	2636	4773	11919	14598
జ్యోతి-సీఎస్ఈ	బాలికలు	1935	4309	2683	5242	2755	4924	11642	18027
కేఎంఐటీ-సీఎస్ఈ	బాలురు	5120	16102	7260	20337	7654	10730	32950	30728
	బాలికలు	5682	21945	8948	28661	9125	15978	33023	55150
గోకరాజు-సీఎస్ఈ	బాలురు	4014	11077	7228	25132	6399	9195	22605	26200
	బాలికలు	5015	14331	7789	23320	7589	11614	21286	27220
నారాయణమ్మ-సీఎస్ఈ	బాలికలు	4634	13033	7004	28674	7446	13239	25241	27323

రాష్ట్రంలో తగ్గిన పేదరికం

13.18 % నుంచి 5.88% తగ్గుదల

- 27.61 లక్షల మందికి పేదరికం నుంచి విముక్తి
- కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అత్యధికంగా 16.59% పేదలు
- అత్యల్పంగా పెద్దపల్లి జిల్లాలో పేదరికంలో ఉన్నది 2.17% మందే
- నీతి ఆయోగ్ నివేదికలో వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో గత కొన్నేళ్లలో పేదరికం రికార్డు స్థాయిలో తగ్గిందని నీతి ఆయోగ్ వెల్లడించింది. 2015–16 నుంచి 2019–21 మధ్య దేశవ్యాప్తంగా 13.5 కోట్ల మంది బహుముఖీయ పేదిరికం నుంచి బయటపడ్డట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా పేదల సంఖ్య 24.85% నుంచి 14.96%కి తగ్గిందని పేర్కొంది. ఇదే కాలానికి తెలంగాణలో 27,61,201 మంది, ఏపీలో 30,19,718 మంది ప్రజలు బహుముఖీయ పేదరికం నుంచి బయటపడ్డట్లు వివరించింది. ఈ మేరకు 'నేషనల్ మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్: ఎ ప్రోగ్రెస్ రివ్యూ 2023' పేరిట నీతి ఆయోగ్ సోమవారం ఢిల్లీలో నివేదిక విడుదల చేసింది. నీతిఆయోగ్ సభ్యులు డాక్టర్ వి.కె. పాల్, డాక్టర్ అరవింద్ వీరమణి, నీతి ఆయోగ్ సీఈఓ బి.వి.ఆర్ సుబ్రహ్మణ్యం సమక్షంలో ఆ సంస్థ వైస్ చైర్మన్ సుమన్ బేరీ నివేదికను విడుదల చేశారు.

గ్రామాల్లో ఎక్కువగా పేదరికం తగ్గుదల

ఈ నివేదిక ప్రకారం తెలంగాణలో 2015–16 నాటికి 13.18 శాతం మంది పేదలు ఉండగా 2019–21 నాటికి వారి సంఖ్య 5.88%కి తగ్గింది. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 19.51% నుంచి 7.51% మంది, పట్టణ ప్రాంతాల్లో 4.92% నుంచి 2.73% మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారు. జాతీయ బహుముఖీయ పేదరిక సూచీ (ఎంపీఐ)లోని విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాల వంటి 12 అంశాలను పరిగణనలోకి తీసుకోవడంతోపాటు 2019–21 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్–5) ఆధారంగా నీతి ఆయోగ్ ఈ నివేదికను రూపొందించింది. తెలంగాణలో అత్యధికంగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 16.59%, అత్యల్పంగా పెద్దపల్లి జిల్లాలో 2.17% మంది పేదలు ఉన్నారు.

తెలంగాణలో ఎంపీఐ సూచికలు :

అంశం	2015-16	2019-21
1) పోషకాహారం లభించని వారు	31.09%	28.35%
2) కౌమార, పిల్లల మరణాలు	1.38%	1.15%
3) వైద్యం అందని బాలింతలు	10.87%	13.17%
4) పాఠశాలలకు వెళ్లని విద్యార్థులు	2.10%	1.35%
5) వంటచెరకు దొరకని వారు	31.67%	7.93%
6) మరుగుదొడ్లు లేని వారు	49.01%	24.41%
7) మంచినీరు లభ్యతలేని వారు	10.80%	3.36%
8) విద్యుత్ సదుపాయంలేని వారు	1.23%	0.44%
9) సొంత ఇల్లు లేని వారు	25.54%	20.49%
10) కనీస ఆస్తి లేని వారు	12.79%	8.51%
11) బ్యాంకు ఖాతా లేని వారు	7.46%	2.74%
12) పాఠశాల విద్య అందని వారు	15.83%	14.56%

తెలంగాణ జిల్లాల్లో పేదల జనాభా శాతం పరిస్థితి

జిల్లా	పేదల జనాభా శాతం (2019-21)	(2015-16)
ఆసిఫాబాద్	16.59%	-------
జోగులాంబ గద్వాల్	15.37%	-------
ఆదిలాబాద్	14.21%	27.12%
వికారాబాద్	12.50%	-------
కామారెడ్డి	11.90%	-------
మహబూబ్‌నగర్	10.27%	24.72%
మెదక్	9.34%	17.87%
వనపర్తి	8.86%	-------
నిర్మల్	7.14%	-------
సంగారెడ్డి	7.09%	-------
నిజామాబాద్	6.76%	21.06%
మహబూబాబాద్	6.45%	-------
వరంగల్ రూరల్	6.45%	-------
జయశంకర్ భూపాలపల్లి	6.33%	-------
నాగర్‌కర్నూల్	5.95%	-------
జగిత్యాల	4.77%	-------
మంచిర్యాల	4.43%	-------
నల్గొండ	4.40%	13.35%
భద్రాద్రి కొత్తగూడెం	4.33%	-------
యాదాద్రి భువనగిరి	4.24%	-------
సూర్యాపేట	3.89%	-------
రంగారెడ్డి	3.83%	5.31%
రాజన్న సిరిసిల్ల	3.68%	-------
సిద్దిపేట	3.39%	-------
ఖమ్మం	3.18%	13.75%
మేడ్చల్ మల్కాజ్‌గిరి	3.06%	-------
జనగాం	2.91%	-------
హైదరాబాద్	2.52%	4.21%
కరీంనగర్	2.50%	8.65%
వరంగల్ అర్బన్	2.41%	-------
పెద్దపల్లి	2.17%	-------
వరంగల్	-------	12.12%

జిల్లా వార్తలు

రామయ్యను దర్శించుకున్న నారాయణపేట ఎస్పీ



ఆలయంలో నారాయణపేట ఎస్పీ కుటుంబీకులు, ఈఓ రమాదేవి

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామిని సోమవారం నారాయణపేట జిల్లా ఎస్పీ వెంకటేశ్వర్లు దర్శించుకున్నారు. ఇటీవల సివిల్స్‌లో మూడో ర్యాంకు సాధించిన ఆయన కుమార్తె ఉమాహారతి తదితరులతోపాటు ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, ఉపాలయాల్లో దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనం అందచేయగా ఈఓ రమాదేవి సన్మానించారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు సోమవారం విరాళం అందచేశారు. ఆర్‌కే.పురానికి చెందిన కొల్లూరి విశ్వభాను రూ.50 వేలు విరాళం అందచేయగా ఈఓ రమాదేవి వారికి రశీదు ఇచ్చి సన్మానించారు. దాత కుటుంబ సభ్యులతోపాటు ఏఈఓ భవానీరామకృష్ణ, ప్రధాన అర్చకుడు సీతారామానుజాచార్యులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఎల్.సాయిబాబు పాల్గొన్నారు.

ఎన్నికల బరిలో ప్రజాపంథా

రాష్ట్రంలోని పలుచోట్ల పోటీ చేస్తాం

- బూర్జువా, పాలకవర్గాలతో పొత్తు ఉండదు
- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



మాట్లాడుతున్న ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి రంగారావు, పక్కన గుమ్మడి నర్సయ్య, నాయకులు

ఇల్లెందు: వచ్చే నవంబర్‌లో అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయని.. ఆ ఎన్నికలలో ప్రజాపంథా వివిధ నియోజకవర్గాల్లో పోటీ చేస్తుందని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు వెల్లడించారు. అయితే, బూర్జువా, భూస్వామ్య, పాలకవర్గాలు, వాటితో పొత్తు పెట్టుకునే పార్టీలతో తమకు పొత్తు ఉండదని స్పష్టం చేశారు. కేవలం విప్లవ సంస్థలతో కలిసి పోటీ చేస్తామని, అవసరమైతే అందరికీ ఆమోదయోగ్యమైన ఉమ్మడి అభ్యర్థిని పోటీలో నిలిపేందుకు సిద్ధమేనని తెలిపారు. ఇల్లెందులోని ఎల్లన్న విజ్ఞాన కేంద్రంలో రెండు రోజులుగా జరిగిన ప్రజాపంథా రాష్ట్ర కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చించి పోరాట కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటుచేసిన రాష్ట్ర కమిటీ నిర్ణయాలను రంగారావు వెల్లడించారు.

ప్రశ్నించే శక్తులపై ఉక్కుపాదం

దేశంలో బీజేపీ ఫాసిస్టు విధానాలు అవలంభిస్తోందని, ప్రశ్నించే వారిపై ఉపా తదితర చట్టాలను ప్రయోగిస్తోందని రంగారావు ఆరోపించారు. ఇక రాష్ట్రంలో కేసీఆర్ ప్రాంతీయ అస్తిత్వం, ఆత్మగౌరవం పేరుతో ప్రజలు వంచిస్తున్నారని మండిపడ్డారు. దొరల పాలనను తలపిస్తుండగా, సమస్యలను విన్నవించుకునే అవకాశం ప్రతిపక్షాలకు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో 11 లక్షల మందికి పోడు పట్టాలు ఇస్తామని చెప్పి 4 లక్షల పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. పట్టాల పంపిణీలోనూ అవకతకలు జరిగినందున, విచారణ జరిపి అర్హులైన గిరిజనులందరికీ పోడు పట్టాలు ఇవ్వాలని కోరారు. అలాగే, గ్రామపంచాయతీ, మధ్యాహ్న భోజనం వర్కర్ల సమ్మె పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జాతీయ నాయకుడు రాయల చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతాంగ సమస్యలు, వ్యవసాయ చట్టాలు రద్దు విషయమై ఈనెల 30న ఏపీలో, 31న తెలంగాణలో జాతీయ స్థాయి సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చాక కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఈమేరకు ఆగస్టు 4న కార్మిక గర్జన పేరుతో రాష్ట్ర స్థాయి ఆందోళనలు చేపడుతున్నట్లు తెలిపారు. కాగా, 24 గంటల పాటు విద్యుత్ ఇస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలోచేర్చాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు కిచ్చెల రంగయ్య, రాయల చంద్రశేఖర్, గుమ్మడి నర్సయ్య, చంద్ర అరుణ, ప్రభాకర్, వనమాల కృష్ణ, చిన్న చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ప్రాణాలంటే పట్టింపులేదా ?



భద్రాచలం వద్ద గోదావరి రెండో వంతెనపై ప్రమాదకర పరిస్థితుల్లో పని చేస్తున్న కార్మికులు



ప్రమాదకర పరిస్థితుల్లో పనులు

భద్రాచలం వద్ద గోదావరి నదిపై రెండో వంతెన నిర్మాణ పనులు దక్కించుకున్న సంస్థ నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. రెండేళ్ల కిందటే వంతెన పనులు పూర్తి చేయాల్సి ఉండగా నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. వేగంగా పనులు చేపట్టలేని సంస్థ.. చివరకు అక్కడ పని చేస్తున్న కార్మికులకు సరైన భద్రత, రక్షణ ఏర్పాట్లు చేయడంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రెండేళ్ల క్రితమే పిల్లర్ల నిర్మాణం పూర్తయింది. గత రెండేళ్లుగా గడ్డర్లు నిర్మిస్తూ ఇటీవలే ఆ పని కూడా పూర్తి చేసింది. ఇక రోడ్డు, నడక దారి, పిట్టగోడ నిర్మాణ పనులు సాగుతున్నాయి. నిత్యం పదుల సంఖ్యలో కార్మికులు ఇక్కడ పని చేస్తున్నారు. వంతెన చివరన నిలబడి, కూర్చుని వీరు చెమట ధార పోస్తున్నారు. ఇలాంటి పనులు చేసేప్పుడు కచ్చితంగా కార్మికులకు హెల్మెట్, నీ గార్డ్, రోప్ సపోర్ట్, బెల్ట్, షూ ఉండాలి. వీటిని పనులు చేపడుతున్న కాంట్రాక్టరే కార్మికులకు సమకూర్చాలి. ఈ రక్షణ పరికరాలతోనే సైట్ ఇంజనీర్లు పనులు నిర్వహించాలి. ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే జాతీయ రహదారుల శాఖ, ఆర్అండ్‌బీ అధికారులు కొరడా ఝుళిపించాలి. కానీ ఇక్కడ పని చేస్తున్న వలస కార్మికుల ప్రాణాలంటే ఎవరికీ పట్టింపు లేకుండా పోయింది. నిత్యం గోదావరి వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తున్న అధికారులు సైతం చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. కూలీల దీనావస్థ చూస్తున్న భక్తులు ఆ రామయ్యే వారిని కాపాడాలంటూ వేడుకుంటున్నారు.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం..





ఎంపీలు నాగేశ్వరరావు, వద్దిరాజుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు

రైల్వేలైన్ అలైన్‌మెంట్‌పై ఎంపీలు నామా, రవిచంద్ర

ఖమ్మం మయూరిసెంటర్/నేలకొండపల్లి: వ్యవసాయం అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్న సీఎం కేసీఆర్ నేతృత్వాన రైతులు ఇబ్బంది పడకుండా చూస్తామని ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర వెల్లడించారు. పాపటపల్లి–జాన్ పహాడ్–మిర్యాలగూడ ప్రతిపాదిత రైల్వే లైన్ అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ ఖమ్మం రూరల్, ముదిగొండ, నేలకొండపల్లి మండలాల రైతులు సోమవారం ఎంపీలను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సన్నచిన్నకారు రైతులకు ఉన్న కొద్దిపాటి భూములు రైల్వే లైన్ కింద వెళ్తే జీవనోపాధి కరువవుతుందని తెలిపారు. దీంతో ఎంపీలు స్పందిస్తూ.. సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు కేంద్ర రైల్వే మంత్రితో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చంద్రావతి, నాయకులు, రైతు ప్రతినిధులు శాఖమూరి రమేష్, కట్టికోల నాగేశ్వరరావు, సాధిక్ అలీ, సుధాకర్, అనంతు నాగేందర్‌గౌడ్, నెల్లూరి భరత్, అనంతు భాగ్యమ్మ, పద్మ, కట్టికోల నర్సయ్య, వల్లూరి పట్టాభి, గుర్రం అచ్చయ్య, పుచ్చకాయల సుధాకర్, ఎడ్లపల్లి వెంకట్రామయ్య, కుర్రా వెంకన్న, తోకల ఉపేందర్, గిస్కా రామ్మూర్తి, రామగిరి వెంకన్న పాల్గొన్నారు.

65 లక్షల ఆయిల్‌పామ్ మొక్కలు సిద్ధం..

రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి



ఎమ్మెల్యే వెంకటవీరయ్యను సన్మానిస్తున్న ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, తదితరులు

సత్తుపల్లి: రాష్ట్రంలో ఎనిమిది జిల్లాల్లో ఆయిల్ పామ్ సాగకు సిద్ధమైన రైతుల కోసం 22 నర్సరీల ద్వారా 65 లక్షల మొక్కలు పంపిణీ చేయనున్నామని రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి వెల్లడించారు. సత్తుపల్లిలోని డివిజన్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఆయిల్ పామ్ సాగు నానాటికీ విస్తరిస్తుండగా, సిద్దిపేట ఫ్యాక్టరీ పనులు మొదలయ్యాయని తెలిపారు. అలాగే, మహబూబాబాద్ జిల్లా తొర్రూరు, వేంసూరు మండలం కల్లూరుగూడెంలో కూడా త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. 2026 నాటికి ఈ మూడు ఫ్యాక్టరీల ద్వారా పామాయిల్ ఉత్పత్తి మొదలవుతుందని వివరించారు. సబ్సిడీ పోగా రూ.20 చొప్పున ఆయిల్ పామ్ మొక్కల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు 24 గంటల్లోనే పంపిణీ చేస్తున్నామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది 8,900 ఎకరాల్లో సాగు లక్ష్యం కాగా ఇప్పటివరకు 1,140 ఎకరాల్లో మొక్కలు నాటారని, నెలాఖరులోగా లక్ష్యాన్ని అధిగమిస్తామని తెలిపారు.

ఎమ్మెల్యే సండ్రకు సన్మానం

తెలంగాణ రాష్ట్ర ఆయిల్‌ఫాం అడ్వైజరీ బోర్డు సభ్యుడిగా నియమితులైన ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యను క్యాంప్ కార్యాలయంలో ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ డివిజనల్ మేనేజర్ బాలకృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్‌తో పాటు శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, కొత్తూరు ఉమామహేశ్వరరావు, అద్దంకి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

దత్తత గ్రామాలపై ప్రత్యేక దృష్టి

రాష్ట్ర గవర్నర్ తమిళిసై



నిధుల మంజూరు పత్రాన్ని అందజేస్తున్న గవర్నర్

అశ్వారావుపేటరూరల్: కొండరెడ్లు అభివృద్ధి సాధించేలా దత్తత గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చెప్పారని మండలంలోని గోగులపూడి గ్రామస్తులు తెలిపారు. నాబార్డు 42వ వ్యవస్థాపక దినోత్సవాన్ని హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించగా ముఖ్యఅతిథిగా గవర్నర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా అశ్వారావుపేట మండలం గోగులపూడి వాసులు గోగుల సీత, చెల్లమ్మ, నాబార్డు డీడీఎం సుజిత్‌కుమార్, వాసన్ సంస్థ ప్రతినిధి సతీష్ కుమార్‌కు కొండ రెడ్ల గ్రామాల అభివృద్ధికి రూ. 9 లక్షల నిధుల కేటాయింపుపై మంజూరు పత్రాన్ని అందజేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ తన దత్తత గ్రామాలైన అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోని గోగులపూడి, పూచికుంటను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు నాబార్డు ముందుకు రావడం హర్షణీయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు అమిత్ జింగ్రా, ఉష తదితరులు పాల్గొన్నారు.